క్వారీ ల్యాండ్‌కు ఎట్టకేలకు మోక్షం..

కమిషనర్ ఆదేశాలతో కొలిక్కి వచ్చిన సమస్య..

క్వారీ స్థలానికి సరిహద్దులను గుర్తిస్తున్న రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి14: కబ్జాలకు గురవుతున్న ఎస్పీఆర్ హిల్స్ క్వారీ ల్యాండ్ స్థలానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. అధికారుల ఉదాసీన వైఖరితో ఇప్పటి వరకు రక్షణ లేకుండా ఉన్న ఈ స్థలానికి బల్దియా కమిషనర్ చొరవతో సరిహద్దులను నిర్ణయించి ఆక్రమణలకు చెక్ పెట్టారు. నగరంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఉన్న ఎస్పీఆర్ హిల్స్ క్వారీ ల్యాండ్‌లో గత నాలుగు దశాబ్దాలుగా రాయి తవ్వకాలు చేపట్టడంతో క్రమంగా పెద్ద లోయగా మారిపోయింది. ఈ క్వారీ స్థలాన్ని ఖైరతాబాద్ మండల రెవెన్యూ అధికారులు 2010లో నగర పాలక సంస్థకు అప్పగించారు. కాగా నాటినుంచి నిరుపయోగంగా ఉంటున్న ఈ స్థలాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్ ఆధ్వర్యంలో ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు ప్రజావసరాల కోసం తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపట్టారు.ఈ భారీ లోయను పూడ్చి మైదానంగా తీర్చిదిద్దారు. కాగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, కార్పొరేటర్ చొరవతో ఈ స్థలం కచ్చితంగా ఎంత ఉంది? కబ్జాకు ఎంత గురైంది? నిర్ధారించి... ప్రస్తుతం ఉన్న స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడేందుకు అధికారులు సంకల్పించారు. ప్రజా ప్రతినిధుల ప్రణాళికతో ఇక్కడ భారీ క్రీడా ప్రాంగణం రూపుదిద్దుకోనున్న తరుణంలో అధికారులు దీనికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు.ఇందులో భాగంగా 2010 లో 9.16 ఎకరాల స్థలానికి డీ మార్కేషన్ చేసి అప్పగించాలన్న బల్దియా అధికారుల ప్రతిపాదనతో రెవెన్యూ అధికారులు మంగళవారం రంగంలోకి దిగి క్వారీ స్థలాన్ని కొలతలు వేసి జీహెచ్ఎంసీ అధికారులకు అప్పగించారు. రెండు రోజుల క్రితం రహ్మత్‌నగర్ డివిజన్‌ను సందర్శించిన జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ఈ పనులు కొలిక్కి వచ్చాయి.ఈ స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో రక్షణ చర్యలు తీసుకోనున్నట్టు ఖైరతాబాద్ మండల రెవెన్యూ అధికారులు బుధవారం పేర్కొన్నారు.

16న రథ సప్తమి వేడుకలు

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 14: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 16న రథ సప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు పరిషత్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్మన్‌ఘాట్ జిల్లా పరిషత్ హైస్కూల్, రంగారెడ్డి జిల్లాలోని ఇంజాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత స్కూల్, వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, మౌలాలిలోని భారతీయ విద్యానికేతన్ స్కూల్‌లో విద్యార్థుల చేత సూర్య నమస్కారాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డి.ప్రదీప్‌కుమార్

మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపడుతున్న డి.ప్రదీప్‌కుమార్

మణికొండ, ఫిబ్రవరి 14: మణికొండ మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మున్సిపల్ నూతన కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన కె.ఫల్గుణ్‌కుమార్‌ను బదిలీ కావడంతో ఆయన స్థానంలో డి.ప్రదీప్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ దివ్యజ్యోతి, మేనేజర్ బి.ఎన్.కె.రమేశ్, ఏఈ సాయిమౌనిక, జేఏవో వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్సే రక్షణ

సినీనటుడు సుమన్

మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న సుమన్ తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 14 : ఆడపిల్లలు స్వీయ రక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సినీనటుడు సుమన్ తల్వార్ అన్నారు. ఈ నెల 18 నుంచి కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరుగనున్న 4వ జాతీయ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన పతకాలను నటుడు సుమన్, రుద్రమదేవి షోటోకాన్ కరాటే, సెల్ఫ్‌డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు ఎన్.లక్ష్మి, టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ డాక్టర్ వి.రవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సినీనటుడు సుమన్ మాట్లాడుతూ... నేడు చిన్న పిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలు చాలా బాధాకరమన్నారు. ఆడ పిల్లలు బయటకు వెళ్లి తిరిగి సురక్షితంగా వచ్చే వరకు తల్లిదండ్రులకు కంటి మీద కునుకు ఉండదని, చిన్న వయస్సు నుంచే వారికి మార్షల్ ఆర్ట్స్ నేర్పించాలని సూచించారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ.. ఈ నెల 18న ప్రారంభమయ్యే ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో 13 రాష్ట్రాల నుంచి 3వేల మంది క్రీడాకారులు, మాస్టర్స్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సాయిగ్రూప్స్ అధినేత టీఎస్ రెడ్డి, మహ్మద్ మసూద్ అహ్మద్, చిన్న శ్రీశైలం యాదవ్, లలిత, సంధ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

సంజయ్‌గాంధీ కాలనీలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మహాలక్ష్మిరామన్‌గౌడ్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి14: ప్రజల సహకారంతోనే సమగ్రమైన ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిరామన్‌గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు బుధవారం సంజయ్‌గాంధీ కాలనీలో రూ.23లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.రామన్‌గౌడ్, మాధవి, జాకీ, అభిషేక్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

'శ్రీలేఖలు' కవితా సంపుటి ఆవిష్కరణ

కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, సినీనటుడు సుమన్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 14 : కవి, రచయిత ప్రవీణ్ శ్రీ రచించిన 'శ్రీలేఖలు' కవితా సంపుటిని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, సినీనటుడు సుమన్ తల్వార్, సినీ గేయరచయిత సిరాశ్రీతో కలిసి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. చైతన్యవంతమైన సమాజ నిర్మాణానికి సాహిత్యం దోహదపడుతుందన్నారు. మనుషుల్లో నిద్రాణమైన సూక్తులను బయటకు తెచ్చి సమాజానికి రచయితలు దిక్సూచిగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్.వేణుగోపాల నాయుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి కృష్ణ, మాజీ డీసీపీ ఆర్ఎస్ఐ బద్రీనాథ్, వెంకటేశం, జర్నలిస్టు సిరాజ్, చిన్న శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 14: శంషాబాద్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో బుధవారం వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సరస్వతీపూజ నిర్వహించిన అనంతరం చిన్నారులకు దాదాపు 25 మందికి అక్షరాభ్యాసం చేయించామని పాఠశాల ప్రధానాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో...

జూబ్లీహిల్స్: యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం వసంత పంచమిని పురస్కరించుకొని చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. ఈ అక్షరాభ్యాస మహోత్సవంలో పాఠశాల వైర్మన్ శిరీష శంకర్ పాల్గొని సరస్వతి అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉషా మీనాక్షి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేశ రక్షణే కాదు..పాలన కూడా చేస్తాం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 14 : సైనికులుగా దేశ రక్షణకు పాటుపడ్డామని, ఇప్పుడు మాజీ సైనికులుగా పాలన చేసి దేశ గమనాన్ని మారుస్తామని వీరో కే వీర్ ఇండియా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలోని మాజీ సైనికులందరితో కలిసి ఈ పార్టీని స్థాపించారని, ఈలోక్ సభ ఎన్నికల్లో 543 స్థానాలకు పోటీ చేస్తామని, ప్రతి అభ్యర్థి మాజీ సైనికుడేనన్నారు. తెలంగాణలో సైతం 17 స్థానాల్లో పోటీ చేస్తామని, ఎవరితో పొత్తు పెట్టుకోమన్నారు. అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తాను నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని, ఈ ఎన్నికల్లో ఒక్కరూపాయి కూడా పంచమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నల్గొండ, మల్కాజిగిరి, చేవెళ్ల, మహబూబ్‌నగర్ అభ్యర్థులు పెదమాను సైదులు, పి.సత్యనారాయణ స్వామి, పి.పెంటారెడ్డి, ఎంఆర్‌కె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్

ఏటీఎంలో చోరీకి యత్నం..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14: ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించి చోరీకి యత్నించిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్ రోడ్ నం. 9లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎంలోకి బుధవారం తెల్లవారు జామున 2గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించాడు. ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించడంతో బ్యాంకుకు సంబంధించిన సెక్యూరిటీ అలారం మోగింది. దీంతో నిందితుడు అక్కడినుంచి పారిపోయాడు. ఈ మేరకు బ్యాంకు మేనేజర్ రామకృష్ణ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐపీసీ 380 రెడ్‌విత్ 511 సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతల స్వీకరణ

శంషాబాద్ ఏసీపీగా శ్రీనివాస్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ సీఐ బాలరాజు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు పోలీసులపై ప్రజలకు నమ్మకం పెరిగే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 14

చిత్కల పొందుతూ మహిళ మృతి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనాథ్ కథనం ప్రకారం... మండలంలోని చిన్నగోల్కొండ గ్రామానికి చెందిన పి.వనజ (45) కుటుంబ కలహాలతో మంగళవారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 14: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పెద్దతూప్ర గ్రామ సమీపంలో నుంచి ఆటోలో 4.5 క్వింటాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. అనుమానం వచ్చిన పోలీసులు ఆటోని ఆపి డ్రైవర్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. దీంతో అతడిని ఆదుపులోకి తీసుకొని విచారించగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్టు ఒప్పుకున్నాడు. విచారణలో నిందితుడు బొమ్మలరామారం వాలుతండాకు చెందిన మిఠియ నాయక్‌గా తేలింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు విటమిన్-ఏ సిరప్ వేయించాలి



విటమిన్-ఏ సిరప్‌ను చిన్నారులకు అందజేస్తున్న వైద్యులు

చిన్నారులకు విటమిన్ ఏ సిరప్‌ను తాగిస్తున్న ఏఎన్ఎం నాగవేణి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 14: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి తప్పనిసరిగా విటమిన్-ఏ సిరప్‌ను వేయించాలని వైద్య అధికారులు తెలిపారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మార్కండేయనగర్‌లో చిన్నారులకు విటమిన్-ఏ సిరప్‌ను వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు విటమిన్-ఏ సిరప్ వేస్తున్నదన్నారు. తద్వారా చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఎదుగుతారని తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో సిఓ ఎస్.కె.గౌరీ, మార్కండేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్, ఏఎన్ఎం ప్రేమాదేవి, ఆశవర్కర్లు జి.మంగ, సునీత, లక్ష్మి, రేణుక, మణెమ్మ, శ్రీలత న్నారు.

జూబ్లీహిల్స్‌లో..

జూబ్లీహిల్స్: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఏఎన్ఎం నాగవేణి పేర్కొన్నారు. ఇందులో భాగంగా 9 నెలల నుంచి 5 ఏండ్లలోపు పిల్లలకు విటమిన్ ఏ సిరప్‌ను పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది చిన్నారులకు ఆయా మందులు వేస్తున్నారు. ఈ మేరకు బుధవారం యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో ఏఎన్ఎం నాగవేణి, ఆశ వర్కర్ జయలక్ష్మితో కలిసి మందులు పంపిణీ చేశారు.

యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌కు బెదిరింపు కాల్స్

బంజారాహిల్స్,ఫిబ్రవరి 14: యూట్యూబ్ చానల్‌లో ప్రసారం చేసిన కథనాన్ని వెంటనే తొలగించాలంటూ చానల్ రిపోర్టర్‌కు ఫోన్ చేసి బెదిరించిన గుర్తు తెలియని వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.12లో నివాసం ఉంటున్న షేక్ రహ్మత్ అలీ క్రైమ్ టుడే యూట్యూబ్ చానల్‌లో విలేకరిగా పనిచేస్తున్నాడు. ఇటీవల చానల్‌లో కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీకి పదవి అంశంపై ఓ కథనాన్ని ప్రసారం చేశారు. కాగా గత నెల 27న గుర్తు తెలియని వ్యక్తి రహ్మత్ అలీకి ఫోన్ చేసి వెంటనే సదరు వార్తా కథనాన్ని యూట్యూబ్ నుంచి తొలగించాలని,లేకుంటే అంతుచూస్తానని హెచ్చరించాడు. దీంతో బాధితుడు రహ్మత్ అలీ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఐపీసీ 507 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉస్మానియా దవాఖాన ప్రాశస్త్యాన్ని కాపాడండి

మాట్లాడుతున్న ఉస్మానియా దవాఖాన పరిరక్షణ కమిటీ సభ్యులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 14 : వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా దవాఖాన ప్రాశస్త్యాన్ని కాపాడాలని ఉస్మానియా దవాఖాన పరిరక్షణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కమిటీ ప్రతినిధులు అనురాధా రెడ్డి, సజ్జద్ షాహిద్, ఇక్బాల్ జావిద్, డాక్టర్ జస్విన్‌జైరత్ మాట్లాడుతూ... నిజాం కాలంలో హైదరాబాద్ కేంద్రంగా అనేక చారిత్రక కట్టడాలు నిర్మించారన్నారు. చార్మినార్ లాంటి కట్టడాన్ని పరిరక్షిస్తున్నారని, అదే కోవలో ఉస్మానియా దవాఖాన భవనాన్ని కూడా రక్షించుకోవాలని తెలిపారు. దవాఖానను కూల్చకుండా వేరే స్థలంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా మరో భవనం నిర్మించాలని సూచించారు. పురాతన భవనాల కూల్చివేతల విషయంలో పాలక ప్రభుత్వాలు స్పష్టతతో వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు సరా మాథ్యూస్, ఆసిఫ్ హనీఫ్, రఘు కిదంబి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయం వార్షిక రథ మహోత్సవాలు ప్రారంభం



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 : జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ ఆలయం వార్షిక రథ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున 3గంటల నుంచి ఆలయ ఫౌండర్ ట్రస్టీలు పి.ఇందిరాజనార్దన్‌రెడ్డి, పి.విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లికి అభిషేకం, విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం, రుత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, M/s. స్కంద ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, వట్టినాగులపల్లి గ్రామం, (a) సర్వే నెం. 224/పార్ట్‌లో ఎకరాలు 1-14.4 గుంటలు మరియు (b) సర్వే నెం. 234/పార్ట్‌లో ఎకరాలు 3-36.4 గుంటలు కలిగిన మొత్తం విస్తీర్ణం ఎకరాలు 5-10.8 గుంటల భూమి (**"ఆస్తి షెడ్యూల్"**) యావత్తు యొక్క టైటిల్‌పట్ల జాగ్రత్త వహించుటకు చర్యలు చేపడుతున్నాము మరియు ఇది దిగువ షెడ్యూల్‌లో మరింత నిర్దిష్టంగా వివరించబడినది.

షెడ్యూల్ ఆస్తి లేదా దానిలోని ఏదేని భాగంపై లేదా భాగంలో ఏదేని హక్కు, టైటిల్, క్లెయిమ్ లేదా ఏవిధమైన ప్రయోజనం కలిగిన వ్యక్తి(లు), ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి పధ్నాలుగు (14) రోజులలోగా మద్దతునిచ్చు డాక్యుమెంట్లతోసహా దిగువ సంతకందారుకు తమ క్లెయిమ్‌లు/అభ్యంతరం(లు) దాఖలు చేయాల్సిందిగా ఇందుమూలముగా కోరబడుతున్నారు. సదరు కాలవ్యవధిలోగా ఏవిధమైన క్లెయిమ్/అభ్యంతరం అందనట్లయితే, క్లెయిమ్ ఉనికిలో లేనట్లు మరియు/లేదా వదులుకున్నట్లుగా భావిస్తూ అటువంటి క్లెయిమ్‌కు ఎటువంటి రిఫరెన్స్ లేకుండా సదరు ఆస్తి లావాదేవీ పూర్తి చేయబడుతుంది.

ఆస్తి షెడ్యూల్

తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, వట్టినాగులపల్లి గ్రామం వద్దగల (a) సర్వే నెం. 224/పార్ట్‌లో ఎకరాలు 1-14.4 గుంటలు మరియు (b) సర్వే నెం. 234/పార్ట్‌లో ఎకరాలు 3-36.4 గుంటలు కలిగిన మొత్తం విస్తీర్ణం ఎకరాలు 5-10.8 గుంటల భూమి యావత్తూ మరియు **సరిహద్దులు: ఉత్తరం:** సర్వే నెం. 224/పార్ట్‌లో మెట్రోపాలిటన్ వెంచర్స్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన భూమి, **దక్షిణం:** సర్వే నెం. 234/పార్ట్‌లో విక్రయదారు భూమి, **తూర్పు:** రోడ్, **పడమర:** సర్వే నెం. 224/పార్ట్ మరియు 234/పార్ట్‌లో విక్రయదారు భూమి.

సం/- **ప్రవీణ్ కుమార్ తొడుపునూరి, పార్టనర్ - ఇండస్‌లా**
#306, అశోకా క్యాపిటోల్, రోడ్ నెం. 2,
బంజారా హిల్స్, హైదరాబాద్-500 034.

ప్రముఖ దర్శకుడు డా. నిర్మల్ జోషిని సత్కరిస్తున్న విరించి ఆస్పత్రి చైర్మన్ డా. ప్రతీక్ అగర్వాల్ తదితరులు

గుండె జబ్బులపై డాక్యుమెంటరీ చిత్రీకరణ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 : రోజురోజుకూ పెరిగిపోతున్న గుండె జబ్బులపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు 'ది బ్రాన్ హార్ట్' పేరుతో డాక్యుమెంటరీని చిత్రీకరిస్తున్నామని ప్రముఖ వైద్యుడు, దర్శకుడు డా.నిర్మల్ జోషి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం.1లోని విరించి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి చైర్మన్, ప్రముఖ కార్డియాక్ సర్జన్ డా.ప్రతీక్ భట్నాగర్‌తో కలిసి డా.నిర్మల్ జోషి మాట్లాడారు. ప్రముఖ కార్డియాక్ సర్జన్లను కలిసి సమాచారం సేకరిస్తున్నానని, డాక్యుమెంటరీ ద్వారా గుండెజబ్బులకు కారణాలు, నివారణ, చికిత్స తదితర అంశాలను వివరిస్తామన్నారు. అనంతరం డా.నిర్మల్ జోషిని విరించి ఆస్పత్రి చైర్మన్ డా.ప్రతీక్ భట్నాగర్, వైస్‌చైర్మన్ సత్యనారాయణ సత్కరించారు.

వార్షికోత్సవంలో భాగంగా పూజల్లో పాల్గొన్న ఆలయ ఫౌండర్ ట్రస్టీ పి.విష్ణువర్ధన్‌రెడ్డి